

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 15 అక్టోబరు 2025




కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన మక్కలు

చిగురించిన ఆశలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో మక్కలు తడిసి నష్టపోతున్న రైతులతో పాటు వ్యవసాయ మార్కెట్లలో ప్రభుత్వ మద్దతు ధర రాని పరిస్థితుల్లో ప్రభుత్వమే మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మక్కల కొనుగోళ్లను తక్షణమే ప్రారంభించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సహకార సంఘాల ద్వార ముందుగా జిల్లాలో 8 కేంద్రాతో పాటు రైతులు డిమాండ్ మేరకు మరికొన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీపావళి పండుగ తర్వాత ఈ నెల 22 లేదా 23న కొనుగో లు కేంద్రాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని మార్క్‌ఫెడ్ ధికారులు తెలిపారు. దీంతో మొక్కజొన్న రైతుల ఆశలు చిగురించాయి.

మార్కెట్‌లలో కొనుగోళ్లు ఇలా..

కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లలో మక్కలు ధరలు మద్దతు ధర కంటే తక్కువగా పలుకుతున్నాయి. ఈ రెండు మార్కెట్‌లలో మక్కలు క్వింటాలుకు రూ.1979 నుంచి రూ.2171 వరకు ధరలు పలుకుతుండగా సగటున రూ.1800 నుంచి 1850 వరకే వ్యాపారులు ఖరీదు చేస్తున్నారు.

జిల్లాలో ముందుగా ఎనిమిది కేంద్రాలు..

జిల్లాలో ధనసరి పీఏసీఎస్ ఆధ్వర్యంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తుండగా కేసముద్రం విలేజ్ పీఏసీఎస్ పరిధిలో కే సముద్రం విలేజ్‌లో, గూడూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో గూడూరులోనూ, మహబూబాబాద్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లోనూ, బయ్యారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో బయ్యారంలోనూ.. గార్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో గార్లలో, కొత్తగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో పొ గుళ్లపల్లిలో, తొర్రూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో తొర్రూరులోనూ కొనుగోలుకేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

రైతు వేలిముద్రలు తప్పనిసరి..

మక్కలకు ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలంటే రైతు తప్పనిసరిగా మక్కల కొనుగోలు కేంద్రానికి వెళ్లి వేలి ముద్రవేయాలని ప్రభుత్వం కొత్త నిబంధన జారీ చేసింది. అంతేకాకుండా రైతు సమగ్ర సమాచార నిర్వహణ పోర్టల్‌లో మొక్కజొన్న పంట వేసినట్లు రైతు పేర్లు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంది. ఎన్ని ఎకరాల్లో పంట సాగు చేశారో అన్న వివరాలు నమోదై ఉండాలి. రైతు కొనుగోలు కేంద్రంలోకి రాగానే వేలి ముద్ర వేస్తే అతడి పోర్టల్‌లో తప్పనిసరిగా వివరాలు వస్తాయి. ఆ వివరాలతోనే ప్రభుత్వ మద్దతు ధరకు మక్కలను ఖరీదు చేస్తారు. రైతులు పట్టేదార్‌పాస్‌పుస్తకం, ఆధార్ , బ్యాంక్ పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది.

మొక్కజొన్న పంటకు మద్దతు

- దీపావళి తర్వాత కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఈ నెల 22 లేదా 23న కొనుగోళ్లు ప్రారంభం
- మంత్రి తుమ్మల ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- ప్రభుత్వ మద్దతు ధర రూ.2400

మద్దతు ధర రూ.2400..

ప్రభుత్వం ఈ ఏడాది మక్కలకు మద్దతు క్వింటాకు ధర రూ.2400 ప్రకటించింది. జిల్లాలో 2022లో మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆ సమయంలో 16వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు ఖరీదులు చేశారు. ఆ తర్వాత మార్కెట్‌లలో మొక్కజొన్నలకు ధరల పెరుగుదల ఉండడంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. మళ్లీ ఈ సీజన్‌లో మక్కలకు ధరలు లేకపోవడంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈ సారి 30 వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు కేంద్రాల ద్వార కొనుగోళ్ల చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు ఆశాభావం, సహకార సంఘాల అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే 14శాతం తేమ ఉండాలని, కచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెబుతున్నారు.


కొత్తగూడలో మక్కలను ఆరబెడుతున్న రైతులు

నాణ్యతా ప్రమాణాలతో మక్కలు తీసుకురావాలి

- ఐలోని శ్యాంకుమార్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్



మక్కలు తీసుకువచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి..నాణ్యత ప్రమాణాలకు లోబడి 14 శాతం తేమ ఉన్న మక్కలను మాత్రం తీసుకురావాలి. కల్తీ గింజలు, పొట్టు, మట్టిపెళ్లలు, ఇతర పదార్థాలు లేకుండా శుభ్రపరిచి తీసుకువస్తే ప్రభుత్వ మద్దతు ధర వచ్చే అవకాశం ఉంది. రైతు ఆధార్, పట్టేదారు పాస్‌పుస్తకం, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్, ఏఈవో ధృవీకరణపత్రంను తీసుకురావాలి.

సహకార సంఘాల పరిధిలోనే కొనుగోలు కేంద్రాలు

- ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి



జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు సహకార సంఘాల పరిధి హెడ్ క్వార్టర్‌లలోనే మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ముందుగా 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా. దీపావళికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన కలిగి ఉండాలి

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్


గర్భిణులకు పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే సేవలపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సూచించారు. కేసముద్రం రైతువేదికలో మంగళవారం మండలంలోని ఐసీడీఎస్ నాలుగు క్లస్టర్ల ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు పోలియో, తదితర టీకాలను సమయానుసారం ఇప్పించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది సీమంతం నిర్వహించగా పోషకాహారాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో శిరీష, తహసీల్దార్ వివేక్, మునిసిపల్ కమీషనర్ టి.శ్రీనివాసరావు, ఎంపీవో బి.వెంకన్న, పీహెచ్‌సీ డాక్టర్ నంబికిషోర్, అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, బండారు వెంకన్న, గుగులోత్ దస్రూనాయక్, సూపర్‌వైజర్లు దుర్గ, ప్రేమజ్యోతి, పద్మావతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల సంక్షేమం కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని మంగళవారం మండ రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన నాగయ్య మాట్లాడుతూ.. 2004లో యూపీఏ ప్రభుత్వం చట్టం తెస్తానని హామి ఇచ్చి దానిని అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులను పట్టించుకోకుండా మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య విభేదాలు సృష్టించి పాలన సాగిస్తోందని విమర్శించారు. కేరళలో వామపక్ష పార్టీల కృషి వల్ల అక్కడి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకువచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, ఎమ్డీ. యాకూబ్, గొడిశాల వెంకన్న, వంగూరు వెంకటేశ్వర్లు, చేపూరి గణేష్, చంద్రకళ, రామేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం రాక

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి 'మాతృయజ్ఞం' కార్యక్రమానికి హాజరు
- పీజేఆర్ గార్డెన్స్‌లో 1.15 నుంచి 1.45 గంటల వరకు గడపనున్న సీఎం



హనుమకొండ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం హనుమకొండకు రానున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ 'మాతృయజ్ఞం' కార్యక్రమం హనుమకొండ వడ్డెపల్లిలోని పీజేఆర్ గార్డెన్స్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రేవంత్‌రెడ్డి వస్తున్నారు. ఆయన రాక కోసం కాంగ్రెస్ నేతలు, అధికార యంత్రాంగం ఏర్పాటు చేశారు. సీఎం మధ్యాహ్నం 1గంటకు సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. 1.05గంటలకు అక్కడి నుంచి బయలుదేరి వడ్డెపల్లి పీజేఆర్ గార్డెన్స్‌కు చేరుకుంటారు. 1.15 నుంచి 1.45గంటల వరకు దొంతి కాంతమ్మ స్మారకార్థం జరిగే 'మాతృయజ్ఞం' కార్యక్రమంలో పాల్గొంటారు. 2గంటలకు హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో తిరిగి వెళతారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో డీసీసీ అధ్యక్షుల ఎన్నిక

- కాంగ్రెస్‌లో అన్ని వర్గాలకు సమన్యాయం
- ఏఐసీసీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్

మహబూబాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పద్ధతిగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నిక జరుగుతుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం ఉంటుందని, అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో పూర్తి స్థాయిలో డోర్నకల్, మానుకోట అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయని రెండేసీ మండలాల చొప్పున పాలకుర్తి, ఇల్లందు, ములుగు నియోజకవర్గాలున్నాయని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఆదేశాలతో డీసీసీ అధ్యక్ష పదవికి పోటీ పడే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి వచ్చామని పేర్కొన్నారు. గతంలో ఐదేళ్లు డీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన వారికి తిరిగి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయం మేరకు ప్రజా స్వామ్య పద్ధతిలో డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని చెప్పారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్, ఎమ్మెల్యేలు శంకర్, మురళీనాయక్

కష్టపడ్డ నేతలకు అవకాశం : షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేలా కష్టపడ్డ నేతలకు అవకాశం కల్పించాలన్నదే ఏఐసీసీ లక్ష్యమని టీపీసీసీ పరిశీలకులు, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ అన్నారు. దేశ వ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా సంస్థాగతంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ఏఐసీసీ శ్రీకారం చుట్టిందన్నారు. అర్హత కలిగిన నేతలకు తప్పకుండా అవకాశాలు దక్కుతాయని తెలిపారు.

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని విమర్శించారు. అనంతరం డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తులు స్వీకరించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి తొలి దరఖాస్తును ఏఐసీసీ పరిశీలకులు దేబాదాస్ పట్నాయక్‌కు అందించారు. కాగా పరిశీలకులు జిల్లా స్థాయి ముఖ్య నాయకుల అభిప్రాయాలను సేకరించారు.

ఈ సమావేశంలో టీపీసీసీ పరిశీలకులు ఇందిరా రావు, ఎమ్డీ. అవేజ్, శ్రీకాంత్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘన పురపురపు అంజయ్య, గుగులోతు దస్రూనాయక్, ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా పాల్గొన్నారు.

అధికారుల హాస్టళ్ల బాట

జిల్లా వ్యాప్తంగా తనిఖీ చేసిన మండల ప్రత్యేకాధికారులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రత్యేకాధికారులు మంగళవారం వసతి గృహాల్లో తనిఖీలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారులు హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, శానిటేషన్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కేజీబీవీ, అన్ని విద్యా సంస్థల వసతి గృహాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వసతి గృహాలు, పాఠశాలల్లో పిల్లలకు పౌష్టికాహారం, సాంకేతిక విద్య, డైట్ ప్రకారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు సంబంధిత అన్ని విభాగాల అధికారులు తమ తమ పరిధిలోని వసతి గృహాల్లో తనిఖీలు చేపట్టి నివేదికను అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించడంతో వారంతా హాస్టళ్ల బాట పట్టి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులకు అందుతున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో పరిసరాలను వంటలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జిల్లాలోని నెల్లికుదురు మండలంలో ప్రత్యేకాధికారి మరియన్న, మరిపెడలో ప్రత్యేకాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, కొత్తగూడలో అధికారి వేముల సురేష్, డోర్నకల్‌లో ప్రత్యేకాధికారి నర్సింహామూర్తి, బయ్యారంలో జడ్పీసీఈవో, ప్రత్యేకాధికారి పురుషోత్తం హాస్టళ్లను తనిఖీ చేశారు.


కొత్తగూడ మండలం పోలారం కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి సురేష్

'పీఎం సూర్యఘర్'కు ఇనుగుర్తి ఎంపిక

ఇనుగుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటికి సౌర విద్యుత్‌ను అందించేందుకు అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన' పథకానికి ఇనుగుర్తి గ్రామం ఎంపికైనట్లు టీజీ రెడ్కో జిల్లా మేనేజర్ గంధం రాజేందర్ తెలిపారు. ఇనుగుర్తిలో మంగళవారం ఈ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 22 గ్రామాలు ఎంపిక కాగా అందులో ఇనుగుర్తి ఒకటని తెలిపారు. సౌర విద్యుత్ కోసం బ్యాంకు రుణం కూడా ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నవీన్‌కుమార్, ఏడీఈ మచ్చ ఐలయ్య, ఏఈ కుదురుపాక రాజు, ఎల్ఎం మలిశెట్టి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీజీరెడ్కో జిల్లా మేనేజర్ గంధం రాజేందర్

మద్యం టెండర్లకు స్పందన కరువు

- ముందుకు రాని వ్యాపారులు
- అధికారుల ఒత్తిళ్లు, చేతివాటమే కారణమా ?
- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు
- వాటి నుంచి అధికారుల అక్రమ వసూళ్లు
- రెండేళ్ల కిందట 2,589 దరఖాస్తులు

తొర్రూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యాపారాల్లో మద్యానికి ఉన్న క్రేజే వేరు ఎత్తులకు పై ఎత్తులు వేసి మద్యం దుకాణాలు దక్కించుకోవాలని చూస్తారు. కానీ ఈ వ్యాపారంలో మజా తెలిసిన వారు ఖర్చులకు వెనకాడకుండా దక్కించుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. గతేడాది వరకు జిల్లాలో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు పోటీ పడిన వ్యాపారులు ఈసారి మాత్రం దరఖాస్తు చేసేందుకు భయపడుతున్నారు. మంగళవారం వరకు జిల్లాలోని 61 షాపులకు 124 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.



ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

అధికారుల ఒత్తిడి, అవినీతే కారణమా ?

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు సమీపిస్తున్నా ఇంకా వ్యాపారులు ముందుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. వ్యాపారులు వెనకడుగు వేయడానికి ఎక్సైజ్ శాఖలో పెరిగిన అవినీతే కారణమా ? అని ప్రచారం జరుగుతోంది. డ్రాలో మద్యం దుకాణాలు కేటాయించినప్పటి నుంచి లైసెన్స్ గడువు ముగిసే వరకు అధికారుల వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగుతుందనే ఆరోపణలున్నాయి. గతంలో దుకాణాలు ఎంపిక కాగానే అధికారులకు పెద్ద మొత్తంలో ముట్టజెప్పామని వ్యాపారులు బహిరంగగానే చర్చించుకుంటున్నారు. తనిఖీలు నిర్వహించే బృందాలకు ప్రతి నెలా ముడుపులు చెల్లించాల్సిందే అని అనధికారిక ఆదేశాలున్నాయి. దీనికి తోడు పొలిటికల్, ప్రజా సంఘాలు, పండుగలు, పబ్బాలు, దుర్గమ్మ పండుగ ఇతర అధికారిక కార్యక్రమాలకు మద్యం బాటిళ్లు, డబ్బులు ఇవ్వాల్సిందే అని మద్యం వ్యాపారులపై ఒత్తిడి చేస్తూ డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టి మద్యం వ్యాపారం చేస్తే తమకు వచ్చే ఆదాయం కన్నా ఖర్చులే అధికంగా ఉంటున్నాయని, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా నాలుగు రోజులే గడువు

ఎన్ని దరఖాస్తులైనా దాఖలు చేసి మద్యం దుకాణాలు దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తారు. రెండేళ్ల కిందట వచ్చిన నోటిఫికేషన్‌కు, ఇప్పటికి ఒకే మార్పు ఉంది. అప్పుడు దరఖాస్తు ధర రూ.2 లక్షలు ఉంటే ఇప్పుడు రూ.3 లక్షలకు పెంచారు. ఈమార్పు ఉన్నా రెండేళ్ల కిందట వచ్చిన దరఖాస్తులతో పోలిస్తే ఈసారి ఇప్పటివరకు చాలా తక్కువ సంఖ్యలో వచ్చాయి. 2023లో జిల్లాలో 59 షాపులకు 2,589 దరఖాస్తులు రాగా ఈసారి నూతనంగా ఏర్పడిన కేసముద్రం మునిసిపాలిటీలో 1, తొర్రూరులో మరో షాపు అదనంగా పెరిగాయి. కానీ దరఖాస్తుల్లో మాత్రం ఉత్సాహం లేదు. ఈనెల 18 వరకు దరఖాస్తు చేసుకునే గడువు ఉంది. గడువు ముగిసేవరకు కూడా రెండేళ్ల కింద వచ్చిన దరఖాస్తులు వస్తాయా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది.

బెల్టు షాపుల హవా

జిల్లాలో బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని 472 గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన 2 నుంచి 6 బెల్టు షాపులు ఉన్నాయి. బెల్టు షాపు లేని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు. బెల్టు షాపులు కొనసాగడం నిబంధనలకు విరుద్ధం అయినా మద్యం విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ, పోలీస్ అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు. బెల్టు షాపుల వలన గొడవలు జరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. బెల్టు షాపులు నియంత్రణ అధికారులకు అదనపు ఆదాయ వనరుగా మారింది. గతంతో పోలిస్తే 2023-25లో విచ్చలవిడిగా బెల్టు షాపుల వ్యాపారం పెరిగిందని విమర్శలు ఉన్నాయి.

అధికారులపై ఒత్తిడి

జిల్లాలో మద్యం దుకాణాలకు అంతంత మాత్రంగా స్పందన ఉండటంతో ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి పెరుగుతుంది. దరఖాస్తు చేసుకునేందుకు మరో 4 రోజులే గడువు ఉండడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగేలా చేయడం ఎలా అని ఆందోళన చెందుతున్నారు. గతంలో పోటీ పడిన వ్యాపారులు, ఆశావహులకు ఫోన్లు చేసి దరఖాస్తు చేయాలని కోరుతున్నారు. వ్యాపారులను ఎక్సైజ్ సిబ్బందితో పాటు అధికారులు సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. డ్రాలో దుకాణం వస్తే మద్యం వ్యాపారానికి పూర్తి సాకారం ఉంటుందని విజ్ఞప్తి చేస్తున్నా ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

చేతులెత్తేసిన అధికారులు

ఒకప్పుడు ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ మద్యం విక్రయాలు, కల్తీ మద్యం జరగకుండా చర్యలు, గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు, బెల్టు షాపులపై చర్యలు తీసుకునేవారు. అవి కొనసాగకుండా నిఘా కట్టడి చేసేవారు. ఇప్పుడు వారి వైఖరి మారిపోయింది. మద్యం అమ్మకాల టార్గెట్‌లు అధిగమించడమే ప్రధాన లక్ష్యం అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

ప్రజల మద్దతు పొందాలి

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్
- మరిపెడలో 'సంఘటన్ సృజన్ అభియాన్' సమావేశం

మరిపెడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల మద్దతు పొందడానికే కాంగ్రెస్ 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. డీసీసీ, పీసీసీ కమిటీల ఎంపికకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. మంగళవారం మరిపెడలోని భార్గవ్ ఫంక్షన్‌హాల్‌లో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్, పీసీసీ పరిశీలకులు ఎమ్మెల్యే శంకర్, ఎండీ అవేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాంచంద్రునాయక్ మాట్లాడారు. డీసీసీ, పీసీసీ కమిటీలు పారదర్శకంగా ఎన్నుకోవడానికి ఈ సమావేశాలు ఏర్పాటు చేశామని ఆశావహులు తమ పేర్లను పరిశీలకులకు సమర్పించాలని సూచించారు. స్థానిక ఎన్నికలపై హైకోర్టు తీర్పుతో కొంత స్తబ్దత నెలకొందని రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు స్థానిక ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులు మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నాయకులు యుగేంధర్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ బాధ్యులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

దంతాలపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రామానుజపురం, దంతాలపల్లి రామోజీతండాలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భట్టు, నాయకులు రాంరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 విజేత విజయ్‌కుమార్‌కు సన్మానం

మరిపెడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డక్నాతండాకు చెందిన జాటోత్ బాలాజీ-భద్రమ్మ దంపతుల కుమారుడు విజయ్‌కుమార్ ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యారు. మంగళవారం బీఆర్ఎస్ మండల నేతలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జర్పుల కాలునాయక్, గంధసిరి కృష్ణ, అజ్మీరా రెడ్డి, హరినాయక్, దుస్స నర్సయ్య, రాంపెల్లి రవి, బొల్లం నర్సయ్య, మునేశ్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీగా ఎంపికైన విజయ్‌కుమార్‌ని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎస్టీ హాస్టల్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో విజయ

హాస్టల్ విద్యార్థులను నిర్లక్ష్యం చేయొద్దు

దంతాలపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో విజయ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పెద్దముప్పారం, దంతాలపల్లిలోని ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేశారు. పెద్దముప్పారం ఎస్సీ వసతి గృహం లో కనీస విద్యార్థుల హాజరు లేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు రాకుండా వేడివేడి ఆహారం అందించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగానే వార్డెన్లు ఉండి విద్యార్థుల బాగోగులను చూసుకోవాలన్నారు. టీచర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్, ఉపాధ్యాయులు, స్థానిక కార్యదర్శి ఏ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

కురవి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కురవి మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. విద్యా ర్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరబాబు, తహసీల్దార్ విజయ పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దంతాలపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై భారీ వాహనాలు నిలబడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారంటూ మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'ట్రాఫికర్' శీర్షికతో వార్త ప్రచురితమయ్యింది. దీంతో సంబంధిత అధికారులు స్పందించారు. ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై అంబేద్కర్ సెంటర్ వద్ద నిలిపిన వాహనదారులకు జరిమానా విధించారు. పార్కింగ్ స్థలంలోనే వాహనాలు ఆపాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక పంచాయతీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

'విధులను నిర్లక్ష్యం చేయొద్దు'

మరిపెడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విధులను నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మరిపెడలోని ఎస్టీ బాలుర గురుకుల కళాశాల, బాలికల మినీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ అమలు తీరు, పరిసరాల పరిశుభ్రత, స్టాక్ రూం, డైనింగ్ హాల్, వంటలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాళ్లు ఉమారాణి, మైథిలీ, వైస్ ప్రిన్సిపాల్ విజయ శాంతి, తదితరులు ఉన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు ఉండాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో గణేశ్

మరిపెడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాణసంచా విక్రయాల కోసం నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తొర్రూరు ఆర్డీవో గణేశ్ అన్నారు. మంగళవారం ఆయన మరిపెడ తహసీల్ కార్యాలయంలో పోలీస్, ఫైర్, రెవెన్యూ, బాణసంచా అమ్మకం దారులతో సమీక్ష నిర్వహించారు. బాణసంచా విక్రయ షాపులకు నిబంధనలు అనుసరించి అనుమతులు ఇవ్వాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. అమ్మకం దారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమీక్షలో తహసీల్దార్ కృష్ణవేణి, ఆర్ఐ శరత్, ఎస్సై సతీశ్, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు చెల్లించండి మహాప్రభో..

- బయ్యారంలో ఉపాధి కూలీల నిరసన
- చేతివాటం ప్రదర్శిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

బయ్యారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అసలే రెక్కాడితేగానీ డొక్కాడని పేద బతుకులు.. వారం రోజులు కష్టపడి పనిచేసినా పట్టుమని పదిహేను వందలు రావు.. అయినప్పటికి కూలీ డబ్బుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. ఎంత ఎదురుచూసినా ఉపయోగం లేకపోవడంతో విసిగి వేసారి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. విజయ గ్రూపునకు చెందిన మహిళలు మే, జూన్ మాసంలో మండలంలోని గురువమ్మ గుట్ట, గట్టుముసలమ్మ, ఎద్దుముక్కల ప్రాంతాలలో 5 వారాల పాటు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద కూలీ పనులు చేపట్టారు. అడవుల్లోని పక్షులు, జంతువుల నీటి వసతి నిమిత్తం కాలువలు, గుంతల పని చేపట్టారు. అనంతరం పది, పదిహేను రోజుల్లో డబ్బులు పడుతాయనుకుంటే దాదాపు నాలుగు మాసాలైనా నేటికి ఖాతాలో డబ్బులు జమ కాలేదు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో మండల పరిషత్ కార్యాయలం ఎదుట బైఠాయించి నిరసన ఆందోళన చేపట్టారు. తరువాత పని చేసిన కూలీలకు సంబంధించిన పేమెంట్స్ క్లియర్ అవడంలో అంతర్యమేమిటని కూలీలు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక కూలీలకు చెల్లించే కూలీ డబ్బుల విషయంలో పలువరు ఈజీఎస్ సిబ్బంది వివక్షత చూపుతున్నారని ఆగ్రహం వక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలీ డబ్బులు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలకు సంబంధించిన కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అంతేకాక పేమెంట్స్ విషయంలో కూడా వివక్షత నెలకొన్నట్లు తెలిసింది.



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

● ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది చేతివాటం..!?

ఉపాధి కూలీలకు కూడి డబ్బులు చెల్లించే విషయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈజీఎస్‌లో పనిచేసే పలువురు సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శిస్తూ కమీషన్ ఇచ్చిన కూలీలకు సంబంధించిన పేమెంట్స్ మాత్రమే త్వరతగతిన క్లియర్ చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో కూలీ దగ్గర వారం రోజుల పనికి సంబంధించిన పేమెంట్‌కు రూ. 100 నుంచి రూ. 200 వసూలు చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై విచారణ చేపట్టిన సిబ్బందిపై చర్యలు చేపట్టాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

● సాంకేతిక కారణంతోనే ఆలస్యం- నరేష్ ఏపీవో, ఈజీఎస్

పలువురు కూలీలకు సంబంధించిన కూలి డబ్బులు సాంకేతిక కారణంగానే జమ కావడంలో ఆలస్యం జరుగుతోంది. పనికి సంబంధించిన వివరాలన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. సాంకేతిక కారణంగానే ఆలస్యం జరుగుతోంది. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న డబ్బులు కూలీల ఖాతాలో జమవుతాయి.



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులను అభినందిస్తున్న నిర్వాహకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాజెక్టు అధికారి డాక్టర్ బి. నాగేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ, నేషనల్ గ్రీన్ క్రాప్స్ సౌజన్యంతో మల్టీ పర్పస్ అవేర్‌నెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏకో బజార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఉత్పత్తులకు సంబధించిన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రకృతిని మనం కాపాడుతే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించ గలుగుతామని పేర్కొన్నారు. దీపావళి పర్వదినానికి నూనె దీపాలతోనే జరుపుకోవాలని సూచించారు. కాలుష్య రహిత గ్రీన్ కాకర్స్ వాడాలని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో 260 మంది విద్యార్థులు పాల్గొని వివిధ రకాల ప్రదర్శనలు నిర్వహించారని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలు కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన అయిషా, మేఘన, ద్వితీయ స్థానంలో నిలిచిన నవ్య, నాగజ్యోతిలకు బహుమతులను ఎన్జీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి. గురునాథరావు అందజేశారు. కార్యక్రమంలో ఏకో క్లబ్ కో-ఆర్డినేటర్ జూపుడి అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు మసూద్ ఆహ్మద్, సాంబశివరావు, వినోద్‌కుమార్, శ్రీనివాస్, హతిరామ్, ఖాసీంషా, సుమన్, ఉపేందర్, సంతోష్‌కుమార్, రవి తేజ, ఉదయ్‌కుమార్, నరేష్. యాకయ్య పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

రూ.1లక్ష 30వేలు రికవరీ ● ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం

నర్సంపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఎం.డి. ఇమ్రాన్ ఇందులో ప్రధాన సూత్రధారి కాగా, మాదాసు భార్గవి, నవీన్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బత్తుల రాజేశ్వరి, అదే జిల్లా కొండయ్‌గూడెంకు చెందిన కుంజా విజయ భాగస్వాములుగా ఉన్నారు. మహబూబాబాద్ పట్టణంలో రెండు దొంగతనాలతో పాటు ఖానాపురం మండలం బుధరావుపేటలో, సెప్టెంబర్‌లో నర్సంపేటలోని ఓ నగల షాపులో చోరీలు చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. దోచుకున్న సొమ్ములో కొంత వాడుకొని మరికొంత సొమ్ముతో ఆటో, ద్విచక్రవాహనం కొన్నట్లు పోలీసులు తెలిపారు. దొంగతనాల్లో రూ.2లక్షల విలువ చేసే బంగారంతో పాటు 4 లక్షల 30 వేలు విలువ చేసే 38 తులాల వెండిగా పోలీసులు నిర్ధారించారు. ఈ దోచుకున్న సొమ్ములో 2 లక్షల 70వేలు ఖర్చు చేయగా రూ.1 లక్ష 30 వలే రికవరీ చేశామని, ఐదుగురిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్

వేర్వేరు కేసుల్లో ముగ్గురి అరెస్ట్

కేసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు చెందిన ముగ్గురు వ్యక్తులను వేర్వేరు కేసుల్లో మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ క్రాంతికిరణ్ తెలిపారు. 2018లో మహిళను బెదిరించి, అవమానకరంగా ప్రవర్తించిన కేసులో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న మండలంలోని ధర్మారం వెంక్యాతండాకు చెందిన రైల్వే ఉద్యోగి బానోత్ సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 2021లో ఒకరిపై ప్రమాదకరమైన వస్తువుతో దాడి చేసిన కేసులో కేసముద్రం స్టేషన్ గిర్నీతండాకు చెందిన అంగోత్ భద్రు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇరువురిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు జైలుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే ఇనుగుర్తిలో నెలరోజుల క్రితం ఖాళీ స్థలం కోసం ఎన్నమాల మహేందర్‌పై ఇనుపరాడ్ తో దాడి చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన మోటమారి మహేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



కార్మికుడి భార్యకు చెక్కు ఇస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్(హనుమకొండ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అన్ మ్యాన్డ్ కార్మికుడు గట్ల కరుణాకర్ భార్య ప్రియాంకకు సీఎండీ వరుణ్‌రెడ్డి మంగళవారం కార్పొరేట్ కార్యాలయంలో రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. జూలై 3న మహబూబాబాద్ సర్కిల్‌లోని ఈదుల పూసపల్లి గ్రామంలో విధి నిర్వహణలో ఉన్న సమయంలో కరుణాకర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ క్రమంలో మరణించిన కరుణాకర్ కుటుంబసభ్యులకు బీమా కంపెనీ ద్వారా వచ్చిన పరిహారాన్ని సీఎండీ అందజేయగా, కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి, న్యూఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ హనుమకొండ డివిజనల్ మేనేజర్ నాగభట్ల జ్యోతిర్మయి, మార్కెటింగ్ మేనేజర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



ఉపేందర్ (ఫైల్)

గార్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి యువకుడు మృతిచెందిన సంఘటన గార్ల మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కాంపాటి ఉపేందర్(30) అప్పసముద్రంలో చెరువులో ఉదయం చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిగుంటలో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై రియాజ్ పాషా గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఉపేందర్‌కు ఇంకా వివాహం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాకాల పంట పొలాల్లో మొసళ్లు



మత్తడి పోసిన సమయంలో బయటకు వస్తున్న వైనం

- సరస్సులో ప్రస్తుతం 200కు పైగా మొసళ్లు ఉన్నాయంటున్న అటవీశాఖ
- పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్న రైతులు
- కనిపిస్తే సమాచారం ఇవ్వాలంటున్న అటవీశాఖఅధికారులు

ఖానాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాకాల సరస్సు మొసళ్లకు ఆవాస ప్రాంతం. సరస్సులో సేద తీరాల్సిన మొసళ్లు ఇటీవల పాకాల ఆయకట్టు పంటపొలాలు, పంట కాలువలు, వ్యవసాయ బావుల్లో ప్రత్యక్షమవుతుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల కోసం ప్రతినిత్యం రాత్రనక, పగలనక రైతులు పంట పొలాల్లోకి వెళుతుంటారు. పంటలకు సాగునీటిని అందించే క్రమంలో పంట కాలువల్లోకి సైతం దిగుతుంటారు. మొసళ్ల సంచారం ఎక్కువవడం మూలంగా ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

మత్తడి ప్రవాహంలో బయటికి..

కొన్నేళ్లుగా ప్రతి ఏటా పాకాల సరస్సు మత్తడి పోస్తున్నది. వర్షాకాలం భారీ వర్షాలకు సరస్సు ఉధృతంగా మత్తడి పోస్తున్న సందర్భంలో నీటి ప్రవాహానికి ఎదురుగా వెళ్లలేని మొసళ్లు మత్తడి గుండా బయటికి వెళుతున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. అదేవిధంగా పాకాల సంగెం, తుంగబందం తూముల ద్వారా అరుదుగా మొసలి పిల్లలు బయటికి వెళుతున్నట్లు చెబుతున్నారు. మత్తడి నీటి ప్రవాహం గుండా తూముల ద్వారా బయటికి వచ్చిన మొసళ్లు ప్రధానంగా పాకాల వాగు, తుంగబందం, సంగెం పంట కాలువల్లో సేద తీరుతుంటాయి.

పంట కాలువల్లో నీటి ప్రవాహం తగ్గినప్పుడు కాలువల వెంబడి అనుసంధానంగా ఉన్నటువ్యవసాయ బావులలోకి వెళుతుంటాయి. ఇదే సమయంలో కొన్ని సందర్భాలలో పంటచేలలో ప్రత్యక్షమవుతున్నాయని అటవీ అధికారులు తెలుపుతున్నారు. పంట పొలాల్లోకి వచ్చే మొసళ్లతోనే రైతులు ఎక్కువగా భయాందోళనకు గురవుతున్నారని, పంట కాలువల్లో నీటి ప్రవాహం తగ్గిన సమయంలో కాలువల వెంబడి పొలాలు ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు.

రెస్క్యూ టీం ఏర్పాటు

పాకాల సరస్సు గుండా బయటికి వచ్చిన మొసళ్లనే కాకుండా నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా ఎక్కడ మొసళ్లు కనిపించినా పట్టుకుని పాకాల సరస్సులో వదిలివేయడానికి నర్సంపేట అటవీశాఖ ఆధ్వర్యంలో బేస్‌క్యాంప్‌కు చెందిన ఐదుగురు సభ్యులతో రెస్క్యూ టీంను ఏర్పాటు చేశారు. గత సంవత్సర కాలంలో ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట మండలాల పరిధిలో 13 మొసళ్లను బంధించి పట్టుకుని సరస్సులో వదిలివేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.

కొత్తూరు శివారు పంటపొలాల్లో ప్రత్యక్షమైన మొసలి (ఫైల్)

200కు పైగా మొసళ్లు

గత సంవత్సరం పాకాల సరస్సులోని మొసళ్ల సంఖ్యను నిర్ధారించి జియోట్యాగింగ్ చేసేందుకు అటవీశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. సరస్సులో 200కు పైగా మొసళ్లు ఉన్నాయని, అందులో 60 నుంచి 70 మొసళ్లు గుడ్లు పెట్టి సంతానం పెంచేవిగా ఉన్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. అదేవిధంగా సరస్సులో మొసళ్ల సంఖ్య ఏటా 20 వరకు పెరుగుతున్నాయని, కానీ, అదే సంఖ్యలో సరస్సు నుంచి బయటికి సైతం వెళుతున్నట్లు అధికారులు గుర్తించారు. బయటికి వచ్చిన మొసళ్లు పంట కాలువలు, పొలాలు, వ్యవసాయ బావులలో ప్రత్యక్షమవుతున్నాయి.



పంటపొలాల్లో కనిపించిన మొసలిని బంధించిన రెస్క్యూ టీం (ఫైల్)

మొసళ్లను చంపొద్దు



పంట పొలాల్లో, పంట కాలువల్లో, వ్యవసాయ బావుల్లో మొసళ్లు కనిపిస్తే చంపకూడదు అటవీ అధికారులకు సమాచారం అందిస్తే గంట వ్యవధిలోనే రెస్క్యూ టీం సభ్యులు వెళ్లి పట్టుకుని పాకాల సరస్సులో వదిలివేస్తారు. భవిష్యత్‌లో సరస్సు నుంచి మొసళ్లు బయటికి రాకుండా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటివరకు పంట పొలాల్లో కనిపించే మొసళ్లతో ప్రాణహాని జరగలేదు. అయినప్పటికీ పంట కాలువల్లో నీరు తగ్గినప్పుడు సమీప పొలాల రైతులు అప్రమత్తంగా ఉండాలి.

\- రవికిరణ్, ఎఫ్ఆర్వో నర్సంపేట

మొసళ్లను పట్టుకోవడం రిస్కే..



మొసళ్లను బంధించడం చాలా రిస్క్‌తో కూడున్నది. అయినప్పటికీ చాలా జాగ్రత్తగా రక్షణ చర్యలు తీసుకుంటూ వాటిని పట్టుకుంటాం. 25 కిలోల లోపు ఉన్న మొసళ్లతో ఇబ్బంది పెద్దగా ఉండదు. 70, 80 కిలోలు ఉన్న మొసళ్లను బంధించాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుంది. సంవత్సరం నుంచి 13 మొసళ్లను పట్టుకుని పాకాల సరస్సులో వదిలాం.

\- నాగరాజు (బేస్‌క్యాంప్ పాకాల) రెస్క్యూ టీం సభ్యుడు



జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

ఇలాగైతే 'బెస్ట్' ఎలా!?

- బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు పేరుకుపోతున్న బకాయిలు
- బిల్లుల పెండింగ్‌తో విద్యార్థులను అనుమతించని యాజమాన్యాలు
- అధికారుల చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రదక్షిణలు
- నిర్వహణ కష్టంగా మారిందంటున్న యాజమాన్యాలు

జనగామ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పెండింగ్ ఫీజు బకాయిల సమస్య విద్యార్థులకు శాపంగా మారింది. ప్రభుత్వం నుంచి మూడునాలుగేళ్లుగా బిల్లులు రాకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బకాయిని సాకుగా చూపుతూ పాఠశాలల యాజమాన్యాలు కొన్ని చోట్ల విద్యార్థులను స్కూళ్లకు అనుమతించడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టరేట్‌ల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పలు జిల్లాల్లో కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. నెల రోజులుగా తల్లిదండ్రులు ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు.

32 వేల మంది విద్యార్థులు

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 227 స్కూళ్లలో సుమారు 32 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ ఎస్టీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో బెస్ట్ అవైలబుల్ స్కూల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో బ్రైట్ బాయ్స్ స్కీమ్ కింద ఉన్న ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద మార్చారు. ఈ స్కీమ్ కింద ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ కింద ఎంపికైన స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తారు. సీట్ల ఖాళీల కంటే ఎక్కువ ఉంటే డ్రా పద్ధతిన సీట్లను భర్తీ చేస్తారు. ఎంపికైన స్కూల్‌లో మొదటి తరగతిలో 20 సీట్ల చొప్పున కేటాయిస్తారు. అలా పదవ తరగతి వరకు 20 సీట్ల చొప్పున కేటాయింపులు ఉంటాయి. ఒక్కో విద్యార్థికి డే స్కాలర్‌కు రూ. 28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.42వేల చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 227 స్కూళ్లలో దాదాపు 32వేల మంది ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు.

అనుమతించని యాజమాన్యాలు

పెండింగ్ బిల్లులను సాకుగా చూపుతూ విద్యార్థులను స్కూళ్ల యాజమాన్యాలు అనుమతించడం లేదు. కొన్ని స్కూళ్ల మేనేజ్‌మెంట్లు విద్యార్థులను పాఠశాలకు రావొద్దంటూ తెగేసి చెబుతున్నారు. తోటి విద్యార్థుల ముందే తమను పాఠశాలకు రావొద్దని చెబుతుండడంతో పిల్లలు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల రెసిడెన్షియల్ యాజమాన్యాలు తాము హాస్టల్, భోజనం, వసతి కల్పించలేమని, కావాలంటే చదువు మాత్రం చెబుతామంటూ తెగేసి చెబుతున్నారు. మూడు, నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి రాకున్నా భోజనం, వసతి కల్పించామని, ఇక తమ వల్ల కాదని అంటున్నాయి. దీంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. పిల్లలను అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు చేసేదేమీ లేక ఆందోళనలకు దిగుతున్నారు. కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేసి అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ పెండింగ్ బకాయిలు విడుదల చేసి తమ పిల్లల చదువులకు మార్గం సుగమం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ. 180 కోట్ల బకాయిలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు సుమారు రూ.180 కోట్ల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. బీఆర్ఎస్ హయాంలో రెండేళ్ల బకాయిలు పెండింగ్ ఉండగా కాంగ్రెస్ వచ్చిన తర్వాత రెండేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కొన్ని స్కూళ్లకు నాలుగేళ్ల బకాయిలు ఉండగా కొన్ని స్కూళ్లకుమూడేళ్లుగా బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు.పెండింగ్ బిల్లులకు సంబంధించి టోకెన్ జారీ చేసినప్పటికీ బిల్లులను మాత్రం ప్రభుత్వం రిలీజ్ చేయడం లేదని యాజమాన్యాలు అంటున్నాయి. కేవలం రూ.180కోట్ల పెండింగ్ బిల్లులను రిలీజ్ చేయకపోవడంతో ఇటు తమకు, అటు విద్యార్థులకూ నష్టం కలుగుతోందని అంటున్నారు. పెండింగ్ ఉండడం వల్ల పాఠశాలల నిర్వహణ తమకు భారంగా మారుతోందని అంటున్నారు.



ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన ఎడ్లబండిలో కూలీలను తీసుకెళ్తున్న రైతు చెవ్వల్ల రాజు

ఎద్దులు పోయి ఇంజన్ వచ్చే..

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పై చిత్రాన్ని చూడండి.. ఎడ్లు తీసుకెళ్లాల్సిన బండిని ట్రాక్టర్ లాగుతోందని అనుకుంటున్నారా! అవును ట్రాక్టర్‌కు ట్రాలీ డబ్బాను కాకుండా పాత ఎడ్ల బండిని అనుసంధానం చేసి ప్రయాణిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు ఓ రైతు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన రైతు చెవ్వల్ల రాజు ఈ ఐడియాను సృష్టించాడు. మంగళవారం గ్రామంలో వ్యవసాయ బావి వద్దకు కూలీలను తీసుకెళ్తుండగా ఈ చిత్రం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. రాజుకు ఐదెకరాల భూమి ఉండగా, మరో నాలుగెకరాలు కౌలుకు చేస్తున్నాడు. భార్య, ముగ్గురు పిల్లలతో పాటు అప్పుడప్పుడు కూలీలను తీసుకెళ్లేందుకు దీనిని ఉపయోగిస్తున్నాడు. ఆటోలో కూలీలను తరలించడానికి ఖర్చు ఎక్కువగా ఖర్చు అవుతున్నట్లు చెప్పాడు.





చిర్ర కిరణ్

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో బోరు బావి నుంచి పైకి వస్తున్న నీరు

ఉబికి వస్తున్న గంగమ్మ

15 ఏండ్ల క్రితం వేసిన బోరు నుంచి నీరు పైకి

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : 200 ఫీట్ల లోతు వరకు వేసిన బోరు బావి, వేసిన 15 ఏళ్లలో ఏనాడు సరిగా పోయని నీరు, రెండు రోజుల నుంచి బోరు బావి నుంచి గంగమ్మ ఉబికి వస్తోంది. దీంతో ఆ రైతు ఆశ్చర్య పోయాడు. ఆగి పోసే బోరు నుంచి ఏకంగా పైకి నీరు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో చోటు చేసుకుంది. కట్ర్యాల గ్రామానికి చెందిన రైతు చిర్ర కిరణ్ ఎకరం పొలం ఎస్సారెస్పీ కాలువ కింది భాగంలో ఉంది. వ్యవసాయం చేస్తూ ఆటో నడుపుతూ కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. తన పొలంలో దాదాపు 15సంవత్సరాల క్రితం సుమారు 200ఫీట్ల వరకు తవ్వించాడు. ఆనాటి నుంచి రెండు రోజుల క్రితం వరకు బోరు బావిలో నుంచి నీరు ఆగుతూ పోస్తూ ఉండేది. పక్కనే చిన్న కుంట సైతం ఉంది. అయినా ఆగే పోసేది. ఎకరం పొలం మాత్రమే కావడంతో ఉన్నదాంట్లో నీటిని సరిపెట్టుకున్నాడు.విచిత్రంగాఒక్కసారిగా నీరు ఏకంగా పైకి తన్నుకు వచ్చి ఉబికి పోస్తోంది.దీంతో రైతుఆనందంవ్యక్తం చేస్తున్నాడు.

గడువులోగా దేవాదులను పూర్తి చేయాలి

- అన్ని అడ్డకులను తొలిగించి పెండింగ్ పనులను వేగవంతం చేయాలి
- భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వరంగల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిర్ణీత గడువులోగా దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని దేవాదుల ప్రాజెక్టు పురోగతిపై రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు అన్ని విధానపరమైన అడ్డంకులు తొలగించాలని, పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఉత్తర తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలలోని ప్రతీరైతుకు సాగునీటి ప్రయోజనాలు చేరేలా చూడాలని ఆదేశించారు. ములుగు జిల్లా గంగారం గ్రామం సమీపంలోని గోదావరి నది నుంచి 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేయడానికి దేవాదుల పథకం రూపొందిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా హనుమకొండ, వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిదిపేట జిల్లాల ఎగువకు 5.57లక్షల ఎకరాలకు సాగును అందించటమే లక్ష్యమన్నారు. మొత్తం నీటి పారుదల సామర్థ్యం 5.57 లక్షల ఎకరాలలో 3.17 లక్షల ఎకరాలకు ప్రస్తుతం సాగునీరు అందిస్తుందన్నారు. భూగర్భ జలాల ద్వారా సాగునీరు అందించి 58,028 ఎకరాలతో కలిపితే దేవాదుల మొత్తం సామర్థ్యం 6.14లక్షల ఎకరాలకు చేరుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. దేవాదులకు రూ.14,269.63కోట్లు ఖర్చు దేవాదుల ప్రాజెక్టుకు సవరించిన అంచనాల ప్రకారం రూ. 18,500కోట్లు కాగా, ఇప్పటివరకు ప్రాజెక్టు కోసం రూ.14,269.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.4230 కోట్లు అవసరంగా గుర్తించామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఖర్చు చేసిన మొత్తంలో సివిల్ పనులకు రూ.11,667.85 కోట్లు, భూసేకరణకు రూ.1,343.06 కోట్లు, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రో-మెకానికల్ ఇన్‌స్టాలేషన్‌లకు రూ.1,170.63కోట్లు ఖర్చు చేశామని వివరించారు. దేవాదుల ప్రాజెక్టు, దాని అనుసంధాన కాలువల కింద ఉన్న ఆయకట్టుకు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలోని అనేక నియోజకవర్గాలలో విస్తరించి ఉందని అధికారులకు వివరించారు. మొత్తం 2,430.82 కిలోమీటర్ల కాలువలు తవ్వాల్సి ఉండగా, 1,663.10కి.మీ. తవ్వకాలు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే 702.62కి.మీ. పైపులైన్లకు గాను, ఇప్పటివరకు 669.66కిలో మీటర్ల మేర పూర్తి చేశామని, కాలువ లైనింగ్ కూడా 799.80కి.మీ పూర్తి చేశామని తెలిపారు. జనగామ జిల్లాలో రఘునాథపల్లి, ఆర్ఎస్ ఘన్‌పూర్ విభాగాలలోని 51,000 ఎకరాలతో సహా దాదాపు 88,000 ఎకరాలకు సాగు నీరు అందించనున్నామన్నారు. గండిరామారం కుడి ప్రధాన కాలువ మాత్ర మే తాటికొండ కొత్తపల్లి, మీదికొండ, రాఘవపూర్, చాగల్, అశ్వారావుపల్లి, గోవర్ధనగిరి వంటి ఏడు గ్రామాల్లోని దాదాపు 5,600 ఎకరాలకు కవర్ చేస్తుందన్నారు.



సచివాలయంలో దేవాదుల ప్రాజెక్టుపై సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సీతక్క, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు

హనుమకొండ, వరంగల్‌లలో ఆయకట్టు సామర్థ్యం 1.1లక్షల ఎకరాలకు మించి ఉండగా.. ములుగు, భూపాలపల్లి విభాగాలు కలిపి 1.2లక్షల ఎకరాలకు పైగా ఉన్నాయని వివరించారు. మిగిలిన ఆయకట్టు సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని రైతాంగానికి సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.

ఇంకా 2,307 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కేఆర్.నాగ రాజు, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రధానకార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సకల ఏర్పాట్లు

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- పోటీ పడనున్న 936 మంది అథ్లెట్లు: సారంగపాణి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలను జిల్లా అధికార యంత్రాంగం, వివిధ క్రీడాసంఘాల బాధ్యుల సమన్వయంతో విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హనుమకొండలోని జేఎన్ క్రీడా మైదానాన్ని మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్, డీఎస్‌ఏ అధికారులు, క్రీడా పోటీల నిర్వాహకులతో కలిసి సందర్శించి క్రీడా పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో నిర్వహించనున్న అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లను చేయాలని నిర్వాహకులకు, అధికారులకు సూచించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. అథ్లెటిక్స్ పోటీల్లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పలు అకాడమీలు, పలు యూనిట్స్ నుంచి 936మంది అథ్లెట్లు, 150 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధనల మేరకు 52 ఈవెంట్లలో అథ్లెట్లు తమ ప్రతిభను నిరూపించుకోనున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే అథ్లెట్ల, సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయడానిక ఏఎఫ్ఐ నిపుణుల బృందం బుధవారం జేఎన్ స్టేడియానికి రానున్నారని సారంగపాణి తెలిపారు. వరల్డ్ అథ్లెటిక్స్ నిబంధనల మేరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొని అథ్లెట్లకు డోపింగ్ పరీక్షలతో పాటు టైమింగ్ స్కోరింగ్ రిజల్ట్ (టీఎస్ఆర్), ప్రపంచ వ్యాప్తంగా క్రీడా పోటీలు వరల్డ్ లైవ్ టెలికాస్ట్ చేయబడుతుందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న రన్స్, త్రోస్, జంప్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్) పోటీలు ఉదయం 6నుంచి 10: 30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5:30గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, జీడబ్ల్యూఎం సీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, ఎంజీఎం ఆర్ఎంవో ముదిరి వసంతరావు, జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ సానిటరి సూపర్‌వైజర్ బేర నరేందర్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

21న దీపావళి నోములు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరమపవిత్రమైన గౌరీ కేదారీశ్వరనోములను ఈనెల 21న మంగళవారం రోజున ఆచరించుకోవాలని భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ..ఈ నెల 20న నరక చతుర్ధశి సందర్భంగా సూర్యోదయానికి ముందే స్నానాలు ఆచరించి హారతులు తీసుకోవాలని అన్నారు. ఆ రోజున పవిత్రమైన గంగాజలం ప్రతీ నీటి చుక్కలో చేరుతుందని, తైలంలో లక్ష్మీదేవి చేరుతుందని, సూర్యోదయానికి ముందు తైలం రాసుకొని స్నానమాచరిస్తే గంగా లక్ష్మీదేవిల అనుగ్రహం కలుగుతుందని అన్నారు. ఈనెల 20న సూర్యోదయానికి ముందు, సూర్యోదయం తర్వాత హారతులు తీసుకోవచ్చన్నారు. 21న కేదారీశ్వర వ్రతాలు ఆచరించుకోవాలని బుధవారం రోజున నోములు కదిలించుకోవాలని అన్నారు. స్వాతి నక్షత్రం లేనందున ఈసారి కొత్త నోములు లేవని, కుటుంబంలో ఎవరైనా కాలం చేసి నోములు ఆగిన వారు స్వాతి నక్షత్రంతో సంబంధం లేకుండా నోముకోవచ్చని వివరించారు.

ఈనెల 22నుంచి శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం ప్రారంభమవుతుందని తెలిపారు. కాగా, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని 21న భద్రకాళి అమ్మవారికి ధనలక్ష్మీ పూజ చేసి నాణేలతో ధనార్చన జరిపి మంగళహారతులు దీపారాధనలు నిర్వహిస్తామని తెలిపారు. పూజ అనంతరం ధనార్చన చేసిన నాణేలను భక్తులకు ప్రసాదంగా ఇస్తామని శేషు వివరించారు.

బాలికల భద్రతే షీ టీం లక్ష్యం



మాట్లాడుతున్న షీ టీం ఎస్ఐ సునంద

కేసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలికల భద్రతే షీటీం లక్ష్యమని, వారి భద్రతకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమకు ఫోన్ చేయాలని షీటీం ఎస్ఐ సునంద కోరారు. కేసముద్రం స్టేషన్ జడ్పీహైస్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు షీటీం, భరోసా, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే షీటీం వాట్సాప్ నెంబరు 8712656935కి సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయవచ్చని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, హెచ్ఎం జి.శ్రీనివాస్, ఏఎస్ఐ సుధాకర్, హెచ్‌సీ సుధాకర్, డబ్ల్యూపీసీ అరుణ పాల్గొన్నారు.

ఆర్యూబీ వద్ద అవస్థలు

● పగిలిన డ్రైనేజీ పైపుతో పాదాచారులు, వాహనదారులకు అవస్థలు ● సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నడిబొడ్డున ఉన్న ఆర్యూబీ వద్ద డ్రైనేజీ పైపు పగిలి ఆ ప్రాంతంలో మురికినీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్యూబీ వద్ద మంగళవారం సీపీఐ ప్రతినిధి బృందం పగిలిన డ్రైనేజీ పైపు, చేరిన మురికినీరు, బురదమ యంగా మారిన ప్రాంతాన్ని పరిశీలించి నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జీ (ఆర్యూబీ) వద్ద డ్రైనేజీ పైపు పగిలి అందులో నుంచి వచ్చిన నీటితో బురదమయంగా మారి కొత్త, పాత బజారులకు రాకపోకలు సాగించే పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యూబీ నిర్వహణ ఆర్అండ్‌బీదా లేక రైల్వేశాఖ, మునిసిపాలిటీల్లో ఎవరిదో తేల్చాలన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, జలగం ప్రవీణ్, నక్క నాగార్జున, గాదె శ్యాం ప్రసాద్, రాగం మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఆర్యూబీ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఐదుగురు ఎంపీడీవోల కేటాయింపు

● జడ్పీ సీఈవో పురుషోత్తం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ఐదుగురు నూతన ఎంపీడీవోలను కేటాయించినట్లు జడ్పీ సీఈవో పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ఇటీవల విడుదల చేసిన గ్రూపు-1 ఫలితాల్లో ఎంపీడీవోలుగా ఎంపికైన వారి నుంచి ఐదుగురిని మానుకోట జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ మండలానికి డి.సుష్మిత, చిన్నగూడూరుకు ఎం. సుజాత, నర్సింహులపేటకు వై. అంజలి, గంగారానికి డి.వైష్ణవి, బయ్యారానికి డి.దీపికలకు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ పోస్టింగ్ ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలిపారు. విధుల్లో చేరి హైదరాబాద్‌లోని తెలంగాణ ఐఆర్డీ శిక్షణ సంస్థలో రెండువారాల పాటు శిక్షణకు హాజరుకావాలని సూచించారు. శిక్షణ అనంతరం వారికి కేటాయించిన మండలాల్లో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలంగాణ జోన్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసర్చ్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి సూచించారు. మహబూబాబాద్ మండలం మల్యాల వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఉమారెడ్డి మాట్లాడుతూ.. యూరియా మోతాదు వాడకంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిర్చి పంట విస్తీర్ణం తగ్గడానికి కారణాలు, అంతర్ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. యాసంగికి నాణ్యమైన విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇరువురికి గాయాలు

గంగారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గంగారం మండలం వెంకమ్మగుంపు మూల మలుపు వద్ద మంగళవారం కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం వైద్యశాలకు తరలించారు. స్థానికులు తెలిపినవివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మానికి చెందిన మహ్మద్ హర్షద్(58), జీవన్‌తో కలిసి వరంగల్‌కు కారులో గంగారం మీదుగా బయలుదేరారు. వెంకమ్మగుంపు దాటిన తర్వాత ఎస్ టర్నింగ్ వద్ద కారు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో హర్షద్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గంగారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ పాం పంటను సాగు చేయాలి

నెల్లికుదురు అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి):వరికి బదులు ఆయిల్‌పాం తోటలు సాగు చేయాలని జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి జినుగు యరియన్న తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు సాగుచేసిన ఆయిల్‌పాం కూరగాయాల తోటలను మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రాయితీలతో ఆయిల్‌పాం తోటలు సాగు చేసుకోవాలన్నారు. పొలంగట్లమీద, డాబాలపైన కూరగాయాలు సాగుచేసుకొని లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి మానస, విజయ్‌పాల్‌రెడ్డి, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

124కు చేరిన మద్యం దరఖాస్తులు

నెహ్రూసెంటర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 61 మద్యం దుకాణాలకు గాను టెండర్లు దక్కించుకునేందుకు ఇప్పటి వరకు 124 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి పేర్కొన్నారు. ఒక్కరోజు జిల్లా వ్యాప్తంగా మంగళవారం 11 దరఖాస్తులు వచ్చాయని, వెరసి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 124 దరఖాస్తులు నమోదయ్యాయని చెప్పారు. గత మూడురోజులుగా వరుసగా మద్యం టెండర్ల దరఖాస్తులు ఊపందుకుంటున్నాయని, రానున్న మరో వారం, పదిరోజుల్లో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరగనుందని తెలిపారు.

బియ్యం అమ్మిన వారిపై చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం బ్రహ్మణపల్లి కేజీబీవీలో బియ్యం అమ్మిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు అంగోతు చందులాల్‌నాయక్, ఎస్‌టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ రామన్ననాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో డీఈవో దక్షిణమూర్తికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేజీబీవీలో బియ్యం అమ్మిన ఘటన నెలరోజులు దాటుతున్న ఇప్పటికి అధికారుల నుంచి స్పందన రాకపోవడం బాధకరమన్నారు. తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని తప్పుబడుతున్నట్లు పేర్కొన్నారు.

డీసీసీ పదవి యాదవులకు ఇవ్వాలి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మానుకోట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని యాదవ కులస్థులకు ఇవ్వాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజు డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో మంగళవారం నిర్వహించిన యాదవ మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో యాదవ కులస్థుల ఓటు బ్యాంకు అధికంగా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి యాదవులకు కట్టబెట్టి తగిన గుర్తింపు నివ్వాలని కోరారు. కాంగ్రెస్‌లో 30 ఏళ్లు పని చేస్తున్న యాదవకుల ముద్దు బిడ్డ కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చెవుల మహేష్, బాబురావు, గజ్జి రాము, పల్లెబోయిన లింగయ్య, రామయ్య, మోహన్, వినయ్, రవి పాల్గొన్నారు.

రోగుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కురవి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డీఎంఅండ్‌హెచ్‌వో రవిరాథోడ్ అన్నారు. కురవి మండలం బలపాల పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఔట్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకున్నారు. సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై రికార్డు నిర్వహణ, ఔషదాల సరఫరా, పరిశుభ్రత, వ్యాధి నివారణ చర్యల అమలు వంటి అంశాలపై సమీక్షించారు. రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు స్రవంతి, అనిల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంలో శిక్షలు కఠినం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి స్వాతి మురారి

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : 18 ఏళ్ల లోపు బాలబాలికలను ఎవరైనా లైంగికంగా వేధించినట్ల యితే అందుకు శిక్షలు కఠినంగా ఉంటాయని మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ స్వాతిమురారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ జూనియర్ కళాశాలను మంగళవారం సాయంత్రం బాల్య వివాహాల నిషేధ చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎవరైనా లైంగికంగా వేధించినట్లయితే పోక్సో చట్టం పరిధిలో వారికి 20 ఏళ్ల వరకు శిక్షపడే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది శృతి తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం ఉక్కు కోసం పోరాడితే కేసులు


కోర్టు ఎదుట భరత్‌చందర్‌రెడ్డి తదితరులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన చట్టంలోని బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కోసం పోరాడితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమపై అక్రమ కేసులు బనాయించిందని డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమ కేసులో మానుకోట జిల్లా కోర్టుకు మంగళవారం భరత్‌చందర్‌రెడ్డితో పాటు గుగులోతు దస్రూనాయక్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, మేక వీరన్న, రాములు నాయక్, కేదాసు రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భరత్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడుతాయని చెప్పారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరావు అన్నారు. మహబూబాబాద్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ఐ తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన హర్షిత్, సైన్ అలీలను మంగళవారం అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించడం పట్ల జిల్లా ఎస్జీఎఫ్ఐ సెక్రటరీ సత్యనారాయణ, జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, ఐలయ్య, పీఈటీ నసీరుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు.

నవంబరు 5,6 తేదీల్లో జిల్లా మహాసభలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నవంబరు 5,6 తేదీల్లో మరిపెడ మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ తెలిపారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవనంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడు తూ.. కార్మికుల హక్కుల సాధన, పరిరక్షణ, లేబర్ కోడ్‌ల రద్దు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాల అమలు కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, ఆఫీస్ బేరర్లు కందు నూరి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి, దుండి వీరన్న పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం

డోర్నకల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :డోర్నకల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.రవికుమార్‌ను మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. గతంలో రవికుమార్ సీరోలు మండలం కాంపెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఫుట్‌బాల్, బేస్‌బాల్ ఇచ్చిన ఉత్తమ శిక్షణ వల్ల ఇద్దరు విద్యార్థినులు అంతర్జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారని జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు బండి నర్సింహా రావు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు తలారి విద్యాసాగర్‌లు తెలిపారు. రవికుమార్ శిక్షణలో రాటుతేలిన లావణ్య నార్వేలో ఆగస్టు 23 నుంచి 30 వరకు జరిగిన హోంలెస్ వరల్డ్‌కప్ ఫుట్‌బాల్ పోటీలలో భారతదేశం తరుపున కెప్టెన్‌గా వ్యవహరించినట్లు చెప్పారు. ఈ నెల 22 నుంచి చైనాలో జరుగనున్న పోటీల్లో సైతం అమల బేస్‌బాల్ జట్టులో దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. వీరిరువురికి ఉత్తమ శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నం దున రవికుమార్‌ను సన్మానించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, సాహెబ్‌అలీ, వెంకటేశ్వర్లు, వసంతరాణి, కమల, అనిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తగూడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పెగడపల్లి శివారులో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కర్లెగండి గ్రామానికి చెందిన బంగారు వెంకటయ్య (45) కొత్తగూడకు ఓ వాహనంలో వస్తుండగా పెగడపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వెంకటయ్య మృతికి సంబంధించిన వివరాలు తెలుసుకుని విచారణ చేపట్టారు.

కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు


సారయ్యకు కేక్ తినిపిస్తున్న నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం కొత్తగూడలో ఘనంగా నిర్వహించారు. కొత్తగూడలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో సారయ్య కేక్ కట్ చేశారు. డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి సారయ్యకు కేక్ తినిపించారు. నాయకులు, కార్యకర్తలు సారయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు, మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, మండల నాయకులు బోయినేనీ ప్రశాంత్‌రెడ్డి, వల్లెపు రంజీత్, నోముల ప్రశాంత్ యాదవ్, గోంది రాజు, భూర్క నరేందర్, బానోత్ దేవేందర్, గద్ద అశోక్, చొప్పరి కుమార్, గుంటుక శ్రీను, అప్సర్, యాదగిరి కిరణ్ పాల్గొన్నారు.

తడిసిన మొక్కజొన్నలను కొనుగోలు చేయాలి

గూడూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తడిసిన మొక్కజొన్నలను తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో కొత్తగూడ, గంగారం, గూడూరు ఏరియా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గూడూరు, కొత్తగూడ, గంగారం ఏజెన్సీ మండలాల్లో మొక్కజొన్నను అధికంగా రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలతో మొక్కజొన్నలు కల్లాల్లోనే తడిసిపోయాయని చెప్పారు. సీపీఎం గూడూరు, కొత్తగూడ, గంగారం ఏరియా కమిటీ కార్యదర్శి నక్క సైదులు, భాగ్యలక్ష్మి, లక్ష్మణాచారి, లక్ష్మయ్య, చంద్రయ్య, మురళి, సుమలత, ప్రశాంత్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులపై ఫీజుల భారం తగ్గించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని వివేకానంద సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని 2025-26 విద్యాస ంవత్సరం డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పవన్, రాకేష్, ప్రవీణ్, సందీప్, మహేష్, జ్ఞానేశ్వర్, వివేక్ పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నిరోధక టీకాలు

ఇనుగుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :ఇనుగుర్తి మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి వచ్చేనెల 14 వరకు పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వనున్నట్లు మండల పశువైద్యాధికారి రవీందర్ మంగళవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో తేదీల వారీగా మూడు నెలల దాటిన పశువులకు ఈ టీకాలను ఉచితంగా వేయనున్నట్లు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● డోర్నకల్ : జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం నుంచి డోర్నకల్ మండలంలో ప్రారంభించనున్నట్లు మండల పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. 15 నుంచి 18 వరకు అమ్మపాలెం, 20 నుంచి 22 తేదీ వరకు ఉయ్యాలవాడ, 23 నుంచి 25 వరకు గుర్రాలకుంట, 27 నుంచి 31 తేదీ వరకు చిల్కోడు, నవంబర్ 1 నుంచి 4 తేదీలలో పెరుమాండ్ల సంకీస, 5 నుంచి 7 వరకు బూరుగుపాడు, 8 నుంచి 12 వరకు గొల్లచర్ల, 13 నుంచి 15 వరకు డోర్నకల్‌లో ఉచితంగా గాలికుంటూ నివారణ టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు.

● గార్ల(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి మండల వ్యాప్తంగా పశువులు ఆవులకు వ్యాపించే గాలికుంటు వ్యాధి టీకాలను ఉచితంగా వేయండం జరుగుతుందని దీన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సురేష్ మంగళవారం తెలిపారు. ఈ నెల 15న బుద్ధారం, 17న రాంపురం, 19న ముల్కనూరు, 25న మద్దివంచ 28న శేరిపురం, 30న చంద్రగిరి, 31న గోపాలపురం, నవంబర్ 1న పోచారం, 6న పుల్లూరు, 11న గార్ల మండల కేంద్రంలోని పశువులకు ఆయా గ్రామాల సెంటర్లల్లో క్యాంపులు పెట్టి టీకాలు అందించడం జరుగుతుందని తెలిపారు.

పాఠశాలల పరిశీలన బృందాల

ఏర్పాటు విరమించుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులచే పాఠశాలల పరిశీలన బృందాల ఏర్పాటును విరమించుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నెల్లుట్ల భాస్కర్, తునికి దేవేందర్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల పరిశీలన బృందాల పేరుతో 1473 మంది ఉపాధ్యాయులను బడికి దూరం చేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. పరిశీలన బృందాల స్థానంలో డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవోలను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను పాఠశాలల తనిఖీలకు నియమించడం వల్ల ఉపాధ్యాయులను విద్యార్థులకు దూరం చేయడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా పాఠశాలల, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తనిఖీ బృందాలకు ఉపాధ్యాయులను నియమించవద్దని తెలిపారు.

బీసీల రిజర్వేషన్ కోసం ఉద్యమించాలి

నెల్లికుదురు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల కోసం ఉద్యమించాలని సీపీఎం మండల నాయకుడు పెరమాండ్ల బాబుగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం వామపక్షపార్టీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌ల కోసం అసెంబ్లీలో ప్రవేశపెట్టి గవర్నర్‌కు సిఫారసు చేయడం జరిగిందన్నారు. రిజర్వేషన్‌లు మద్దతు తెలపడంలో అన్ని పార్టీలు విఫలమయ్యాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలుకు వామపక్షాలు పూర్తిమద్దతూ తెలుపుతున్నాయన్నారు. రిజర్వేషన్‌ల సాధనకు మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట్ల సాయిలు, సత్యనారాయణ, ఇరుగు అనిల్, ఎండీ సర్దార్, యాకూబ్, పాల్గొన్నారు.

టీజేవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సంగెం హర్షిత్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి యూత్ ఫెడరేషన్(టీజేవైఎఫ్) మానుకోట జిల్లా అధ్యక్షుడిగా కురవి మండల కేంద్రానికి చెందిన సంగెం హర్షిత్ నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంగళవారం జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించి హర్షిత్‌కు నియామక పత్రాన్ని అందించారు. హర్షిత్ గత కొంత కాలంగా తెలంగాణ జాగృతి బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి టీజేవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, శివారెడ్డి, తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర నాయకులు నలమాస శ్రీకాంత్, అల్వాల జితేందర్, గంధసిరి వేణులకు సంగెం హర్షిత్ కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులను విడుదల చేయాలి

● బీఎస్పీ రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్

నెహ్రూసెంటర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గిరిజన, హరిజన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులను వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్ అన్నారు. జిల్లాలో వివిధ పాఠశాలలో ఈ స్కీం కింద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దార్ల శివరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు గిరిజన, హరిజన విద్యార్థులపై సవతితల్లి ప్రేమ చూపుతు న్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా బెస్ట్ అవెలబుల్ స్కీం నిధులు విడుదల కాకపోవడం సిగ్గుచేటన్నారు. స్కీం పరిధిలో గల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థులను పాఠశా లలకు రానివ్వకుండా ఫీజు చెల్లిస్తేనే రానిస్తామని లేకపోతే రావొద్దని నిరాక రిస్తూ మానసికంగా వేదిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మం త్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలపై ఏమాత్రం ప్రేమ ఉన్న తక్షణమే నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనియేడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బీఎస్పీ నాయకులు మిర్యాల నాగరాజు, అంగోతు లక్పతి, శ్రీను, పవన్, శంకర్, కుమార్, రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న బీఎస్పీ రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్ తదితరులు

సుప్రీం కోర్టు జస్టిస్‌పై

దాడి హేయనీయం

ఇనుగుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :సుప్రీం కోర్టు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఇనుగుర్తి పెద్ద బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పప్పుల వెంకన్న ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడి రాజ్యాంగంపై దాడిగా పరిగణిస్తూ నిందితు న్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మాంకాలి సలీంరామ్, బేతమల్ల చంద్రయ్య, గుజ్జునూరి బాబురావు, జాటోత్ హరిచంద్, గండు నాగన్న, చిన్నాల కట్టయ్య, వెంకటే శ్వర్లు, దుంపల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు సాధించి తీరుతాం : ఎమ్మెల్యే కోరం

బయ్యారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరు నూరైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలువురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు. అనంతరం బయ్యారంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం సుప్రీం కోర్టు (అత్యున్నత న్యాయస్థానం) ను ఆశ్రయించినట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నట్లు పేర్కొన్నారు. కానీ బీసీ రిజర్వేషన్ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయటం సరికాదన్నారు. కాగా బీఆర్ఎస్ పదేళ్లలో చేపట్టలేని సంక్షేమం, అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లలోపే చేసి చూపించిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని ఇష్టారీతిన కొల్లగొట్టిందని ఆరోపించారు. రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసేలా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు.


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య